## క్లుప్తంగా

### డాక్టర్ శ్రీనివాస్‌కు యూకే అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరు వేదాంత హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ పోలిశెట్టి శ్రీనివాస్‌కు సర్జరీ రంగంలో అత్యంత గౌరవప్రదమైన రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఎంఆర్సీఎస్ అవార్డుకు యూకే వారు ఎంపిక చేశారు. ఎడిన్‌బర్గ్ ప్రతిష్టాత్మకమైన రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ అవార్డుకు డాక్టర్ శ్రీనివాస్‌ను ఎంపిక చేసినందుకు మంగళవారం వేదాంత హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చింతా రామకృష్ణ, డాక్టర్ చింతా వాసవి అభినందించారు.

### నేడు లాఫ్టర్ యోగ ప్రదర్శన

గుంటూరు మెడికల్: ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం లాఫ్టర్ యోగ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్ కుమార్ తెలిపారు. షుగర్ వ్యాధిలో లాఫ్టర్ యోగ ప్రాధాన్యంపై సాయంత్రం 7 గంటలకు స్థానిక జేకేసీ కళాశాల పక్కన ఉన్న డాక్టర్ రామ్స్ డయాబెటీస్ కేర్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### కారును ఢీకొట్టిన లారీ...

పట్నంబజారు: నిబంధనలు పాటించకుండా పగలు సమయంలో నగరంలోకి ప్రవేశించిన సిమెంట్ లోడ్ లారీ కారును ఢీకొట్టిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. తెలంగాణ నుంచి వస్తున్న సిమెంట్ లోడ్ లారీ మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో చుట్టుగుంట సమీపంలోకి రాగానే ఒక కారును ఢీకొట్టింది. దీనితో కారు ముందు భాగం దెబ్బతింది. దీనితో బాధితుడు లారీను స్టేషన్‌కు తీసుకునివచ్చి, గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు నెలాఖరు వరకే గడువు

నెహ్రూనగర్: ఆస్తి పన్నుపై వడ్డీ లేకుండా చెల్లించడానికి ఈ నెలాఖరు వరకే గడువు ఉందని, పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై ఒకటి నుంచి పన్ను బకాయిలపై రూ.100కి రూ.2 వడ్డీ పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే డిమాండ్ నోటీసులు సచివాలయాల వారీగా పంపిణీ చేసినట్లు వివరించారు. ఎవరికైనా అందకుంటే అందుబాటులోని వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శి ద్వారా తీసుకోవచ్చని సూచించారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థల పన్నులు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్లతో పాటుగా భారత్‌పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్లలో కూడా పన్ను చెల్లించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

### యువతి ఫొటోలు మార్ఫింగ్‌పై కేసు

గుంటూరు ఈస్ట్: యువతి ఫొటోలు మార్ఫింగ్ చేసి కొందరు వ్యక్తులు షేర్ చాట్‌లో అప్‌లోడు చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీపురానికి చెందిన యువతి బీఎస్సీ వరకు చదివి ఖాళీగా ఉంటోంది. షేర్ చాట్‌లో పరిచయమైన నలుగురితో చాటింగ్ చేస్తుంది. ఈక్రమంలో ఆ నలుగురు యువతి ఫొటోను న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి షేర్‌చార్ట్‌లో అప్‌లోడు చేశారు. షేర్‌చాట్‌లో తన ఫొటోలు చూసుకున్న యువతి కంగుతిని మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యువతుల అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: వేర్వేరు ఘటనలో మహిళ, ఇద్దరు యువతులు కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అంకమ్మనగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన వివాహిత సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకి కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో కేవీపీ కాలనీలో నివసించే ఓ కుటుంబానికి చెందిన 18 సంవత్సరాల యువతి మంగళవారం కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో ఏటీ అగ్రహారానికి చెందిన 19 సంవత్సరాల యువతి ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకి కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జెడ్పీలో ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టాలి

**జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా**



అధికారులతో సమావేశమైన జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆదేశించారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో తన చాంబరులో జెడ్పీ పరిపాలనా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రతి విభాగంలో జరుగుతున్న కార్యకలాపాలను గురించి అధికారులతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు, ఉద్యోగోన్నతులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీ ఆస్తుల పరిరక్షణ, లీజు బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎఫ్ సెక్షన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను తక్షణమే క్లియర్ చేయాలని కోరారు. ఈనెల 23న నిర్వహించనున్న స్థాయి సంఘ సమావేశాలను సమర్థంగా నిర్వహించేందుకు తగు నివేదికలతో రావాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీలోని వివిధ విభాగాల్లో పని చేయని పాత కంప్యూటర్ల స్థానంలో కొత్త సిస్టమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి ఒక్కరూ విధులను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు.

## సమస్యలపై అధికారులు బాధ్యతగా ఉండాలి

**ఎమ్మెల్యే ముస్తఫా**



మసీదు కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. మంగళవారం నియోజకవర్గంలోని 14 డివిజన్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా చాకలి బావి దగ్గర ఉన్న మసీదును సందర్శించారు. సైడ్ డ్రెయిన్ల నిర్మాణంలో భాగంగా మసీదు ప్రహరీ తిరిగి నిర్మించాలని ఎమ్మెల్యే ముస్తఫాను మసీదు పెద్దలు కోరారు. దీనిపై స్పందించిన ఆయన ప్రహరీ నిర్మించాలని నగరపాలక సంస్థ అధికారులను సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల జ్యోతిపద్మజా, సంకూరి శ్రీను, మసీదు కమిటీ సభ్యులు షేక్ చాంద్‌బాషా, షేక్ సుబాని, షేక్ అస్లాం, వైఎస్సార్ సీపీ నేతలు వల్లెపు బాబు, అచ్చి కిరణ్, వెంకటేశ్వర్లు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి



తనిఖీలు నిర్వహిస్తున్న డీటీసీ కరీం, ఎంవిఐలు

పట్నంబజారు: విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి అని డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ) షేక్ కరీం తెలిపారు. రవాణాశాఖ అధికారులు మంగళవారం గుంటూరు నగరంలోని జేకేసీ కళాశాల రోడ్డులో తనిఖీలు చేపట్టారు. నిబంధలను పాటించని 8 బస్సులపై కేసులు నమోదు చేశారు. డీటీసీ కరీం మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభం అయినప్పటికీ నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 60పైగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాటిలో భాగంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు పొందని బస్సులు, విద్యాసంస్థలపైన దృష్టి సారించినట్లు చెప్పారు. నిత్యం ఈ తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎంవీఐ గోపాల్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు



విద్యార్థినికి ఉపకార వేతన చెక్కు అందజేస్తున్న శామ్యూల్, నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏఎన్‌యూ విశ్రాంత ప్రొఫెసర్ ఎన్.శామ్యూల్ పేర్కొన్నారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లోని బాలికల వసతి గృహంలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు అమరావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కొండవీటి నరసింహారావు, కార్యదర్శి పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

## దయాహృదయ సేవా సంస్థలో ఉచిత వసతి



విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న శ్రీహరిరెడ్డి, కొండా శివరామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: అనాథ పిల్లలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్లు ప్రముఖ ఆడిటర్, దయా హృదయ సేవా సంస్థ అధ్యక్షుడు తుమ్మూరు శ్రీహరి రెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డు అన్నదాన సమాజం ప్రాంగణంలోని దయాహృదయ సేవా సంస్థలో ఆశ్రయం పొందుతూ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు మంగళవారం అందజేశారు. శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ దయాకర్ సామాజిక స్పృహతో వీధి, అనాథ బాలలను చేరదీసి వారికి కావలసిన ఉచిత భోజన, వసతి కల్పిస్తూ పాఠశాలస్థాయి నుంచి కళాశాల స్థాయి విద్యావంతులుగా ఎదిగే అవకాశాలు కల్పించారని వివరించారు. తద్వారా అనేకమంది విద్యార్థులు ఇంజినీర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, అకౌంటెంట్స్ తదితర రంగాలలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. క్రేన్, రోటరీ, ఐటీసీ, పోలిశెట్టి, బొమ్మిడాల, ట్రిపుల్‌ఎక్స్ మాణిక్యవేలు వంటి నగరంలోని అనేకమంది ప్రముఖులు చేయూతనందించి పేద అనాథ బాలలు క్రమశిక్షణతో చదువుకుని వారికి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించారని చెప్పారు.

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆరో తరగతి నుంచి హైస్కూలు, జూనియర్, డిగ్రీ, పీజీ చదువుకునే బాలురకు ఉచిత వసతి, అల్పాహారం, భోజనంతో పాటు ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థులకు దాతల సహకారంతో ఫీజులు చెల్లించే సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని జిల్లా, నగరంలోని అన్ని సామాజిక వర్గాలకు చెందిన పేద విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ప్రవేశాల కోసం 94402 64619లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అంగలకుదుటి బ్రహ్మేంద్రరావు, కోశాధికారి కె.సుబ్రహ్మణ్యం, సభ్యులు కొండా శివరామిరెడ్డి, పీపీకే రామారావు, జి.శ్రీనివాస్, డాక్టర్ కె.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న పాటిబండ్ల రామకృష్ణ. వేదికపై డాక్టర్ ఉమాశంకర్ తదితరులు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిది సంవత్సరాల పాలనలో అన్ని వర్గాలను సమానంగా చూశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం గుంటూరు లాల్‌పురం రోడ్డులోని జిల్లా కార్యాలయంలో మైనార్టీ మోర్చా సమావేశం నిర్వహించారు. మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్‌పీరా, జిల్లా ప్రధాన కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, భాస్కర్, ఈస్ట్ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ ఉమా శంకర్, కుద్దూస్, బాషా, రఫీ, యూసఫ్, జోసఫ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ, పద్మనాభం పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రామానాయక్

గుంటూరు ఈస్ట్: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రామనాయక్‌లు మాట్లాడారు. వేర్వేరు ఘటనల్లో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈనెల 19వ తేదీ రాత్రి అరండల్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. బత్తుల వెంకటేశ్వర్లు, షేక్ బాదుల్లాను అరెస్టు చేసి, వీరి నుంచి 750 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఘటనలో మంగళవారం రవితేజ, కిరణ్, ఒడిశాకు చెందిన జగబందు జైనా ముగ్గురిని అరెస్టు చేసి వీరి నుంచి 15 గ్రాముల గంజాయి, రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఒడిశాకు చెందిన జగబందు జైనా ఒడిశాలో తక్కువ రేటుకు గంజాయి కొనుగోలు చేసి, గుంటూరు తీసుకొచ్చి ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నాడన్నారు. మత్తు పదార్థాలు విక్రయించడం నేరమని, అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసు పురోగతిలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. రెండు ఘటనల్లో మొత్తం రెండు కిలోల 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

**తులసి గ్రూపు చైర్మన్ రామచంద్ర ప్రభు**



వైద్యులను అభినందిస్తున్న తులసి రామచంద్ర ప్రభు

గుంటూరు మెడికల్: పేద రోగులకు అత్యాధునిక వైద్య సౌకర్యాలతో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త, తులసి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. తులసి రామచంద్ర ప్రభు, ఆయన తనయుడు తులసి కృష్ణ చైతన్య జన్మదినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అమినాబాద్‌లోని తులసీ సీడ్స్ ఫ్యాక్టరీలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదిత్య మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని రామచంద్ర ప్రభు ప్రారంభించారు. వైద్య శిబిరంలో పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ కృష్ణ స్రవంత్, డాక్టర్ అమూల్య, డాక్టర్ బాలాజీ, డాక్టర్ కాశీరాం, డాక్టర్ రాంబాబు, పాకనాటి రమాదేవి, ఏటుకూరూ మాజీ సర్పంచి ఉగ్గిరాల సీతారామయ్య, మిరియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాథ స్వామి రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రని పురస్కరించుకుని కొత్తపేటలోని జగన్నాథ స్వామి దేవస్థానంలో మంగళవారం బలభద్ర సుభద్ర సమేత జగన్నాథ స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.శ్రీనివాసరావు, చైర్మన్ జయప్రకాష్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఒడిశాకు చెందిన భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలక్ష్మి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివ కుమారి పాల్గొన్నారు.